# ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న అధికారులు

- 29 రూట్లకు పోలింగ్ సామగ్రి చేరవేత
- నిర్వహణకు 16వందల మంది సిబ్బంది
- బందోబస్తు విధుల్లో 650మంది పోలీసులు
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎన్నికల పరిశీలకుడు

ఎల్లారెడ్డి/ ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 29: ఎల్లారెడ్డి అసెంబ్లీకి గురువారం జరుగనున్న పోలింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలోని జీవదాన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ప్రత్యేక బస్సులో ఎన్నికల సిబ్బందితో పాటు సామగ్రిని అధికారులు బుధవారం తరలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శిబిరంలో పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. నియోజకవర్గంలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, తాడ్వాయి, సదాశివనగర్, గాంధారి, రామారెడ్డి, రాజంపేట్ మండలాల్లోని పలు గ్రామాల్లో 270 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందుకోసం 1,600 మంది సిబ్బందిని నియమించగా.. వారు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, పోలింగ్ సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. 29 రూట్లలో బస్సులను ఏర్పాటుచేశారు. రూట్‌ల వారీగా సిబ్బంది, ఎన్నికల సామగ్రిని చేరవేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు సజావుగా జరగడానికి 650మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించారు. 169 పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం అందజేశాలని పోలీస్ సిబ్బందికి అధికారులు ఆదేశించారు. పోలింగ్ ముగిసే సమయానికి పోలింగ్ కేంద్రం లోపల ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించాలని సూచించారు.

ఎల్లారెడ్డి పట్టణంలో మోడల్ పోలింగ్ కేంద్రం తోపాటు జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో ప్రత్యేకంగా మహిళా పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటుచేశారు. ఓటు వేసిన అనంతరం ఫొటో దిగడానికి సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు.

***డిస్ట్రిబ్యూషన్ సెంటన్‌ను పరిశీలించిన కలెక్టర్..***

ఎల్లారెడ్డి ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ బుధవారం ఉదయం సందర్శించారు. పోలింగ్ సిబ్బంది, అధికారులకు పలు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల అబ్జర్వర్ జగదీశ కూడా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించి రిటర్నింగ్ ఆధికారికి పలు సూచనలు చేశారు. జిల్లా నోడల్ అధికారి రఘునాథ్ కూడా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించి, సిబ్బంది గ్రామాలకు తరలే వరకు అక్కడే ఉన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.


సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు



ఎల్లారెడ్డిలోని సెల్ఫీ పాయింట్



ఎల్లారెడ్డిలోని మహిళా పోలింగ్ కేంద్రం వద్ద ముగ్గు వేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది


ఎల్లారెడ్డిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

## ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

**ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు**


విధులు నిర్వహించే సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 29: ఎన్నికలు ముగిసేవరకు పోలీసులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని జీవదాన్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఆయన ఎన్నికల విధులను నిర్వహించే పోలీసులకు ఎస్పీ సింధూశర్మ ఆదేశాల మేరకు పలు సూచనలు, సలహాలు చేసారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి పోలీసులు ప్రధాన పాత్ర వహించాల్సి ఉంటుందన్నారు. ఓటు వేయడానికి వచ్చిన వారి గుర్తింపు కార్డును పరిశీలించాలని సూచించారు. గురువారం ఉదయం 5-30గంటలకు మాక్ పోలింగ్ ఉంటుందని, ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారని, పూర్తి సమయం పోలీసులు విధుల్లో ఉండాల్సి ఉంటుందన్నారు. సాయంత్రం ఐదు గంటల అనంతరం ఓటు వేయడానికి వచ్చిన వారిని లోపలికి అనుమతించరని అన్నారు. 5 గంటల వరకు పోలింగ్ బూత్‌లోపల ఉన్నవారికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంటుందని తెలిపారు. వీటిని పోలీసులు గమనిస్తూ ఉండాలన్నారు. పోలింగ్ సిబ్బంది, ఏజెంట్లతోపాటు ఎన్నికల అభ్యర్థులను మాత్రమే పోలింగ్ కేంద్రంలోనికి రానివ్వాలని, మిగతా ఎవ్వరు కూడా లోపలికి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత పోలీసులదే అన్నారు. ఎవరైనా గొడవ చేస్తే వారిని వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించాలని సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసి, పోలింగ్ బాక్స్‌లు, వీవీప్యాట్‌లు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకునే వరకు పోలీసులు తమ విధుల్లో చురుగ్గా ఉండాలని తెలిపారు.

## పోలింగ్‌కు సర్వం సిద్ధం


గాంధారిలోని పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

గాంధారి, నవంబర్ 29: గురువారం జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం అధికారులు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. గాంధారి మండలంలో మొత్తం 38,972 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో పురుషులు 19,411, మహిళలు 19,561 మంది ఉన్నారు. మండలంలో మొత్తం 44 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటింగ్ సజావుగా జరగడం తోపాటు, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లకు సంబంధించిన పీవోలు, ఏపీవోలతో పాటు ఇతర అధికారులు ఎన్నికలకు సంబంధించిన సామగ్రితో తమకు కేటాయించిన గ్రామాలకు బుధవారం సాయంత్రం చేరుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, ప్రశాంతంగా నిర్వహించేందుకు స్థానిక పోలీసులతోపాటు బీఎస్ఎఫ్, కేంద్ర బలగాలు బందోబస్తులో పాల్గొంటున్నాయి.

***ఏర్పాట్లు పూర్తి..***

సదాశివనగర్, నవంబర్ 29: నేడు(గురువారం) నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ హిమబిందు బుధవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 24 గ్రామ పంచాయతీల పరిధిలో 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అర్హులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

***కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది..***

తాడ్వాయి, నవంబర్ 29: మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రం చేరుకున్నారు. మండలంలోని 18 గ్రామాల్లో మొత్తం 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉన్నది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటుచేశారు. పోలింగ్ శాతం పెరిగేలా.. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## ఓటర్లకు డబ్బులు పంచుతున్న కాంగ్రెస్ నాయకుడి అరెస్ట్

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 29: గ్రామంలో తిరుగుతూ డబ్బులు పంచుతున్న కాంగ్రెస్ నాయకున్ని అరెస్టు చేసినట్లు ఎస్సై గణేశ్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొక్కొండ గ్రామంలో మంగళవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు డబ్బులు పంచుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు రామ్మోహన్, రాజేశ్వర్ గ్రామానికి వెళ్లారు. అక్కడ కొంతమంది గుమిగూడి డబ్బులు పంచుతున్నట్లు గుర్తించారు. పోలీసులను గమనించిన సదరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన రంభ హరికృష్ణ పోలీసులకు చిక్కాడు. అతడి వద్ద పంచడానికి సిద్ధంగా ఉన్న రూ.40వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభ పరిచేందుకు డబ్బులు పంచుతున్నట్లు గుర్తించి హరికృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

***ముగ్గురు స్థానికేతరులు..***

ఎల్లారెడ్డి, నవంబర్ 29: స్థానికేతరులైన ముగ్గురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఎల్లారెడ్డి ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. 28వ తేదీ మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానికేతరులు నియోజకవర్గంలో ఉండకూడదు. పట్టణంలోని ఒక ఇంట్లో స్థానికేతరులు ఉన్నారన్న సమాచారం పోలీసులకు అందింది. వారు వెళ్లి పరిశీలించగా.. కామారెడ్డి పట్టణానికి చెందిన ప్రవీణ్‌కుమార్, దోమకొండ మండలం అంచనూర్ గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి, హైదరాబాద్ సరూర్‌నగర్‌కు చెందిన వెంకటసాయి కుమార్ ఉన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఏఎస్సైకి గాయాలు


ఏఎస్సై నర్సయ్య తలకు గాయాలు

సదాశివనగర్, నవంబర్ 29: సదాశివనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఎస్సై నర్సయ్యకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విధి నిర్వహణ కోసం సదాశివనగర్‌కు వెళ్లి వస్తూ ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు ఢీకొన్నది. దీంతో ఏఎస్సై తలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి చేరుకొని గాయాలైన ఏఎస్సైని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. కారును అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.